మూన్నాళ్ల ముచ్చటేనా!

- సాగరతీరంలో శిథిలమైన కుర్చీలు
- సేద తీరేందుకు సందర్శకుల అవస్థలు


సీ హారియర్ మ్యూజియం వద్ద విరిగిన కుర్చీ


శిథిలస్థితిలో బీచ్ రోడ్డులోని కుర్చీలు



బీచ్ రోడ్డు: సాగర తీరంలో ఇటీవల ఏర్పాటు చేసిన కుర్చీలు శిథిలమయ్యాయి. జీ–20 సదస్సు కోసం చేపట్టిన సుందరీకరణ పనుల్లో భాగంగా తీరం వెంబడి సందర్శకులు సేద తీరేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. ఇవి మూడు నెలల ముచ్చటగానే మిగిలిపోయాయి. చాలా కుర్చీలు అప్పుడే విరిగిపోయాయి. సముద్రం చెంతన పచ్చదనం మధ్య కాసేపు కూర్చుని సేద తీరుదామని ఆశతో కుటుంబ సభ్యులతో వస్తున్న నగరవాసులకు విరిగిన కుర్చీలు దర్శమిస్తుండడంతో నిట్టూరుస్తున్నారు. ఏర్పాటు చేసిన మూడు నెలలకే పాడైపోవడంపై పెదవి విరుస్తున్నారు.

సీఎం పర్యటన ప్రాంతంలో కూడా..

ఈ నెల 11న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీచ్ రోడ్డులోని సీ హారియర్ మ్యూజియంను ప్రారంభించనున్నారు. అదే ప్రాంతంలో ఏర్పాటు చేసిన కుర్చీలు కూడా విరిగిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. తీరం వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలను అందమైన పువ్వులతో అలంకరించారు. పూల కుండీలను కూడా తీరం వెంబడి ఏర్పాటు చేశారు. ఇవి కూడా పాడైపోయాయి. పూల కుండీలు, స్తంభాలకు ఏర్పాటు చేసిన పువ్వులు మాయమైపోయాయి. జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణ లేకే సుందరీకరణ పనులు ఇలా మూన్నాళ్ల ముచ్చటగా మిగిలిపోయాయని పలువురు సందర్శకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైన కుర్చీలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పబ్లిక్ డిమాండ్

చెత్త కుప్పలు తొలగించాలి


కేఆర్‌ఎం కాలనీలో ఇళ్ల మధ్యలో చెత్త కుప్పలు

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీలో ఇళ్ల మధ్యలో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. సీఎంఆర్ అధినేత మావూరి ఇంటి లైన్‌లో వీధి చివర చెత్త కుప్పలుగా దర్శనమిస్తోంది. దుర్వాసన భరించలేకపోతున్నాం. తక్షణమే చెత్తను తరలించాలి

– ఈశ్వరరెడ్డి, కేఆర్‌ఎం కాలనీ

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


ఇసుకతోటలో ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట మధ్యలో ఉన్న రహదారిపై మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. మ్యాన్‌హోల్ పైకప్పు కిందకు దిగిపోయింది. దీంతో గొయ్యల తయారైంది. ద్విచక్ర వాహనచోదకులు ఏమాత్రం ఏమరుపాటుగా డ్రైవింగ్ చేసినా ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. తక్షణమే మ్యాన్‌హోల్ పైకప్పు ఎత్తు పెంచి సరిచేయాలి.

– కె.రామారావు, ఇసుకతోట

క్లుప్తంగా

విభాగానికి ప్రింటర్ బహూకరణ


విభాగాధిపతి టి.షారోన్‌రాజుకు ప్రింటర్ బహూకరిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు విభాగానికి నూతన ప్రింటర్‌ను బహూకరించారు. తాము చదువుకున్న విభాగానికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో విద్యార్థులు నూతన ప్రింటర్‌ను కొనుగోలు చేసి విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజుకు అందజేశారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.ప్రకాశరావు, ఆలీ, రాము, ప్రవీణ దేవి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇస్కాన్ ప్రభూజీ బీజీ దాస్

ఎంవీపీ కాలనీ: సనాతన యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సర్కిల్‌లో చలి వేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఇస్కాన్ ప్రభూజీ బీజీ దాస్ మంగళవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ తరఫున ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ చలివేంద్రం ఈ నెలాఖరు వరకు కొనసాగించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు గుంట ధర్మారావు తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

11న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 11న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

బైక్ డూమ్‌లో పాము


బైక్ డూమ్‌లోకి చేరిన పాము

కొమ్మాది: బైక్ తీసి బయటకు వెళ్దామని సిద్ధమయ్యేసరికి డూమ్‌లో పామును చూసి అవాక్కయ్యాడు ఓ యువకుడు. జీవీఎంసీ 4వ వార్డు చిన ఉప్పాడకు చెందిన రమేష్ మంగళవారం ఉదయం భీమిలి వెళ్లడానికి తన బైక్‌ను తీసి శుభ్రం చేస్తున్న సమయంలో బైక్ లైట్ (డూమ్)లో పామును చూసి ఒక్కసారిగా ఆందోళన చెందాడు. సుమారు 4 అడుగులు ఉండే పాము డూమ్‌లోకి ఎలా చేరిందో తెలియక, దానిని ఎలా బయటకు పంపాలో అర్థంకాక కాసేపు సతమతమయ్యాడు. చేసేదేమీ లేక ఆ బైక్‌ను ఓ గంటపాటు ఇంటి వద్ద వదిలివేయడంతో ఆ పాము నెమ్మదిగా బయటకు జారుకుంది.

వేసవి విజ్ఞాన శిబిరం సందర్శన


విద్యార్థులతో ముచ్చటిస్తున్న జీను మహేష్

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జీను మహేష్ సందర్శించారు. విద్యార్థులకు ఎలాంటి విజ్ఞానాన్ని అందిస్తున్నారు.. అందుకు చేపట్టిన శిక్షణా కార్యక్రమాలపై ఆరా తీశారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులతో మాట్లాడి వసతుల కల్పనపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. గ్రంథాలయ విజ్ఞానాన్ని విద్యార్థులు ఒడిసి పట్టాలన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా మంచి విజ్ఞానం సాధ్యమవుతుందని చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచుతామన్నారు. శిక్షణా శిబిరంలో భాగంగా 2వ రోజు కథలు చదవడం, మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

17న దుకాణాలకు బహిరంగ వేలం

సీతంపేట: జీవీఎంసీ జోన్–3 పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలకు ఈ నెల 17న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఆశీలుమెట్ట వద్ద గల జోన్–3 కార్యాలయంలో ఈ వేలం జరగనుందని జోనల్ కమిషనర్ జె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు బహిరంగ వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు జోన్–3 కార్యాలయం పని వేళల్లో సూపరింటెండెంట్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

వైభవంగా దుర్గమాంబ జాతర

అమ్మవారిని దర్శించుకున్న మేయర్, ఇతర ప్రముఖులు


ప్రత్యేక పూజల్లో మేయర్ వెంకట హరికుమారి దంపతులు

కంచరపాలెం: కంచరపాలెం పరిధి దుర్గానగర్, గొల్ల కంచరపాలెం ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తొలిపూజ గ్రామ కమిటీ సభ్యులు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలతో దర్శనాలు ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. నగర మేయర్ గొలగాని వెంకట హరికుమారి దంపతులు, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు, కార్పొరేటర్లు రాజశేఖర్, రజిని, వాణీనానాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గౌరీనగర్, గవర కంచరపాలెం, రెడ్డికంచరపాలెం, ఊర్వశికూడలి, దయానందనగర్, గోకుల్‌నగర్, ఐటీఐ కూడలి, తాటిచెట్లపాలెం, కరాసా, ఎన్‌ఏడీ, గోపాలపట్నం ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పలువురు నాయకులు, సేవా సంఘాల ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. సాయంత్రం అమ్మవారి ప్రతిమలతో శ్రీరామ సేవా సమాజం వద్ద గల మూలవిరాట్ నుంచి తిరువీధి నిర్వహించారు. సుమారు 49 ఘటాలను ఆలయానికి చేర్చారు. కోలాటాలు, తప్పెటగుళ్లు, చిడతలు, వివిధ వేషాలు, నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకొచ్చి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాత్రపల్లి వెంకటరమణ, వై.వి.రావు, వై.ఎ.రావు, ఎస్.ఎస్.కుమార్, పి.పెంటి నాయుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఐదో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


గంజాయితో పట్టుబడ్డ నిందితులు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఫోర్తు టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. కేరళకు చెందిన శ్యామ్‌దాస్, అవినాష్.. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి విశాఖ రైల్వేస్టేషన్ పోస్టు ఆఫీస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. అటు వైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు వారిని పట్టుకుని విచారించగా.. 8 కిలోల గంజాయి గుర్తించారు. ఫోర్తు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు

గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతంపేట దరి షిర్డీసాయిబాబా ఆలయం సమీపంలోని ఒక ఇంటి మేడపై ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారంతో ద్వారకా ఎస్ఐ అప్పలరాజు, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రమణ దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి పౌడర్‌తో పాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

కవితలు పంపేందుకు ఈ నెల 18 చివరి తేదీ

ఎంవీపీ కాలనీ: విశాఖపట్నం కళావేదిక కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలకు కవితలు పంపేందుకు ఈ నెల 18వ వరకు గడువు పొడిగించినట్టు ట్రస్ట్ ప్రతినిధి సాలిపల్లి మంగావేణి ఒక ప్రకటనలో తెలిపారు. 75 సంవత్సరాల జనజీవనం అంశంపై కవితలు రాయల్సి ఉంటుందని పేర్కొన్నారు. కవితలను డాక్టర్ నండూరి రామకృష్ణ, ప్లాట్ నంబర్–132, సెక్టార్–8, ఎంవీపీ కాలనీ చిరునామాకు పంపించాలన్నారు. పోస్టు ద్వారా వచ్చిన వాటిలో ఉత్తమ కవితలను ఎంపిక చేసి తొలి మూడు స్థానాల్లో నిలిచిన కవితలకు ఈ నెల 28న పౌర గ్రంథాలయంలో నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు 85228 99458 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కారుణ్య నియామకాల దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులు పరిశీలిస్తున్న ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్‌లోని ప్రజారోగ్య విభాగంలో పని చేస్తూ మృతి చెందిన వారి స్థానంలో కొత్తవారి నియామకాలకు సంబంధించిన దరఖాస్తులను గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ మంగళారం పరిశీలించారు. వివిధ వార్డుల్లో శానిటరీ కార్మికులుగా పని చేస్తున్న వారిలో సుమారు 38 మంది మృతి చెందగా, ఆ స్థానాల్లో వారి వారసులను నియమించేందుకు జీవీఎంసీ అధికారులు గతంలోనే దరఖాస్తులు స్వీకరించారు. వాటిని పరిశీలించి రీవెరిఫికేషన్ కోసం వాటిని గాజువాక జోనల్ కార్యాలయానికి సిఫార్సు చేయగా, సహాయ ప్రజారోగ్యాధికారి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులను జోనల్ కార్యాలయానికి పిలిపించి వారి వారసత్వ ధ్రువపత్రాలను పరిశీలించారు. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన తర్వాత వాటిని జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి పంపిస్తామని, అక్కడ ఉన్నతాధికారులు తుది నిర్ణయం తీసుకుంటారని ఏఎంవోహెచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ బీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఐలా పారిశుధ్య కార్మికుల విధుల బహిష్కరణ


ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్దగల ఐలా అడ్మినిస్ట్రేటీవ్ భవనం వద్ద నిరసన చేపట్టిన ఐలా పారిశుధ్య సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: విధులు నిర్వర్తిస్తున్నా పూర్తి స్థాయి లో వేతనాలు చెల్లించడం లేదని, పీఎఫ్ పేరుతో తమకు రోజువారి చెల్లిస్తున్న జీతంలో కోతలు విధిస్తున్నారని ఆటోనగర్ ఐలా మున్సిపల్ సిబ్బంది ఆందోళనకు దిగారు. మంగళవారం ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ఆటోనగర్ ఏపీఐఐసీ అడ్మిన్ బిల్డింగ్ వద్ద 80 మంది కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఆటోనగర్‌లో 80 మంది స్వీపర్‌లు 5 ట్రాక్టర్ల ద్వారా నిత్యం మున్సిపల్ పనులు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. తమకు రోజువారి రూ.300 చెల్లిస్తున్నారన్నారు. చెల్లిస్తున్న వేతనంలో రూ.30 కోత విధిస్తూ పీఎఫ్ కటింగ్ అంటున్నారని చెప్పారు. వేతనాలు కూడా 10 రోజులకొకసారి చెల్లిస్తున్నారని అన్నారు. కాంట్రాక్టర్ మారినప్పుడల్లా తమలో కొందరిని విధుల నుంచి తప్పిస్తున్నారని, ఇప్పుడు కోత విధించిన డబ్బుల విషయంలో అయోమయం నెలకొందన్నారు. ప్రస్తుత కాంట్రాక్టర్‌కు సంబంధించి ఇక మూడు నెలలు మాత్రమే పని ఉందని, తర్వాత తమ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమ సమస్యలు పరిష్కరించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై వివరణ తీసుకోవడానికి సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్లో సంప్రదించాలని ఫోన్ చేయగా కాంట్రాక్టర్ స్పందించలేదు.

రెండు రైళ్లు ఆలస్యం



తాటిచెట్లపాలెం : షాలిమార్‌లో మే 9న మంగళవారం మధ్యాహ్నం 3.20 గంటలకు బయల్దేరాల్సిన షాలిమార్ – చెన్నై (12841) కోరమాండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5.20గంటలకు బయల్దేరింది. 9న చెన్నై సెంట్రల్‌లో రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 7.15కు బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్ – హౌరా(12840) మెయిల్ మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 10.05గంటలకు బయల్దేరుతుంది. అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు ఇవి చేరుకోనున్నాయి. ఈ రెండు రైళ్లు ఆలస్యంగా చేరుకున్న కారణంగా ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం'


మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

సీతమ్మధార: జగనన్నకు చెబుతాం–1902 టోల్ ఫ్రీ నంబర్ కార్యక్రమాన్ని మంగళవారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కన్ఫరెన్స్ ద్వారా పలు జిల్లా అధికారులతో మాట్లాడారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రెవెన్యూ శాఖ, పోలీసు అధికారులు, సచివాలయ కన్వీనర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ప్రమీల గాంధీ, తహసీల్దార్లు పి..శ్యామ్‌ప్రసాద్, రమణయ్య, ద్వారకా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మూర్తి, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ సీఐలు రామారావు, సింహాద్రినాయుడు, శ్రీనివాసరావు, మల్లీశ్వరరావు, సోమశేఖర్, ఎన్.సాయి, షణ్ముఖరావు, డిప్యూటీ తహసీల్దార్ చేతన్‌కుమార్, ఆర్ఐ రవికృష్ణ, ఎస్ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా కొత్తమ్మ ఉత్సవాలు ప్రారంభం


ఉత్సవంలో మహిళల కోలాటం

అల్లిపురం: అమ్మవారివీధి ప్రజల ఆరాధ్య దైవం, గ్రామదేవత కొత్తమ్మవారి నెల రోజుల పండగ మంగళవారం ఘనంగా ప్రారంభమయింది. ఈ సందర్భంగా కొత్తమ్మవారికి ఉదయం నుంచి విశేష పూజలు చేశారు. సాయంత్రం మొదటి మంగళవారం భూలోకమాత అమ్మవారి పండగ వైభవంగా చేపట్టారు. తొలుత అమ్మవారి వీధిలో గల పెద్దింటి నుంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, మహిళల కోలాటం, బిందుల నృత్యాల మధ్య అమ్మవారి తిరువీధి ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారిని కాగడాల వెలుగులో అమ్మవారివీధి, కుమ్మరవీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్‌రోడ్డు, నేరెళ్లకోనేరు జంక్షన్ల మీదుగా గోకుల్ థియేటర్ ఊరేగించారు. అక్కడ భూలోకమాత అమ్మవారికి పూజలు నిర్వహించి పండగ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో నీలాపు రమణారెడ్డి, నీలాపు విజయానందరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాల శ్రీహరిరెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగర తీరంలో చల్ల చల్లగా..


రుషికొండ బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

కొమ్మాది: ఉదయం నుంచి ఉక్కపోత, గాలి లేక ఎర్రటి ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు సాయంకాలం సాగరతీరాన్ని ఆశ్రయించారు. మంగళవారం భానుడు భగభగమంటూ నిప్పులు కక్కడంతో గంటల తరబడి సముద్ర తీరంలో స్నానాలు చేసేందుకు పర్యాటకులు ఆసక్తి కనబరిచారు. భీమిలి, సాగర్‌నగర్, రుషికొండ బీచ్‌లో పర్యాటకుల తాకిడి పెరిగింది.

పవర్ లిఫ్టింగ్‌లో బుల్లయ్య కళాశాల విద్యార్థికి రజతం


విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్

సీతంపేట: ఇటీవల కేరళ అలప్పుజాలో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థి రజత పతకం సాధించాడు. బీఏ తృతీయ సంవత్సరం విద్యార్థి ఎం.దుర్గాప్రసాద్ 93 కిలోల విభాగంలో తలపడి బెంచ్ ప్రెస్‌లో రజత పతకాన్ని, స్క్వాడ్ 265 కేజీల్లో రజత పతకం, డెడ్ లిఫ్ట్ 240 కేజీల్లో రజత పతకాన్ని గెలుపొంది, మొత్తంగా 665 కిలోలు ఎత్తి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌గా రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌ను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, కో ఆర్డినేటర్ లక్ష్మణబాబు, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ యు.గంగాభవాని అభినందించారు.

కేజీహెచ్‌కు బీపీ ఆపరేటర్ల వితరణ


కేజీహెచ్‌కు బీపీ ఆపరేటర్లు అందజేస్తున్న సింహాద్రి టీఎంటీ, హిమా హ్యూమానిటేరియన్ సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: సింహాద్రి టీఎంటీ, హిమ హ్యూమానిటేరియన్ సంస్థ కేజీహెచ్‌కు బీపీ ఆపరేటర్లను సమకూర్చాయి. వాటిని హిమ హ్యూమానిటేరియన్ చైర్మన్ బీఎస్ మూర్తి, సింహాద్రి టీఎంటీ డైరెక్టర్ వి.వి.కృష్ణారావు కేజీహెచ్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఏఆర్‌ఎంవో డాక్టర్ అరుణదేవికి అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ 32 ఏళ్లగా హిమ హ్యూమానిటేరియన్, సింహాద్రి టీఎంటీ కేజీహెచ్‌కు అందజేస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. మరెన్నో సేవా కార్యక్రమాలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ స్పెషల్ మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ పైల సన్నిబాబు, ఏఆర్‌ఎంవో డాక్టర్ అరుణదేవి, డాక్టర్ జగదీష్, మీసాల రామకృష్ణ, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ సులోచన, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, పల్లా ఆనంద్, కేవీ వేంకటేశ్వరరావు, హిమ హ్యూమానిటేరియన్ వ్యవస్థాపకుడు టీవీడీ దాస్ పాల్గొన్నారు.

'రామోజీ మోసాలకు సూత్రధారి చంద్రబాబే'


పులపా రవీంద్రనాథ్ ఠాగూర్, అర్బన్ కాపు సంఘం అధ్యక్షుడు

తాటిచెట్లపాలెం: ఇటీవల మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ నిర్వహించిన చర్చా వేదిక ద్వారా మార్గదర్శి, రామోజీలు ఏ విధంగా ప్రజలను మోసం చేశారో తెలిసిందని, ఈ మోసాల వెనక ప్రధాన సూత్రధారి చంద్రబాబేనని విశాఖ అర్బన్ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులపా రవీంద్రనాథ్ ఠాగూర్ స్పష్టం చేశారు. ఈ వేదిక ద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్ అవకతవకలు, దోపిడీ విధానం, ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నారో తెలియజేశారన్నారు. ఆనాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటూ రామోజీరావు మోసాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించారని ఆయన విమర్శించారు. రాష్ట్రాన్ని దోచుకున్న పెద్ద దొంగలు రామోజీ, చంద్రబాబులు దొరల్లా చలామణి అవుతున్నారన్నారు. వీరిని నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోయారని తెలిపారు. వీరికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఇటువంటి చర్చావేదికల ద్వారా నిజాలు తెలుస్తాయని, మరిన్ని ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యపరచాలని రవీంద్రనాథ్ ఠాగూర్ కోరారు.